## క్లుప్తంగా

### గడ్డివామి దగ్ధం

**నెల్లూరు సిటీ:** రూరల్ మండలంలోని మాదరాజుగూడూరులో శనివారం రాత్రి ప్రమాదవశాత్తు గడ్డివామి దగ్ధమైంది. బోసుబోయిన వెంకటేశ్వర్లుకు చెందిన గడ్డివామికి నిప్పు అంటుకోవడంతో స్థానికులు గుర్తించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. అప్పటికే రూ.50 వేలు విలువ చేసే గడ్డివామి దగ్ధమైందని బాధితుడు వాపోయారు. అయితే ఘటనకు సంబంధించిన కారణం తెలియలేదు.

### సీపీఎం నేతల ర్యాలీ



**నెల్లూరు(వీఆర్సీసెంటర్)/ నెల్లూరు సిటీ:** దేశ సమగ్రత పరిరక్షణకు సీపీఎం ఆధ్వర్యంలో సమైఖ్యత యాత్రలు ఆదివారం ప్రారంభమయ్యాయి. నగరంలోని 23, 32వ డివిజన్లలో పడారుపల్లి, సుందరయ్య కాలనీ పరిసర ప్రాంతాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు మాదాల వెంకటేశ్వర్లు, రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్ పాల్గొని, మాట్లాడారు. ఏప్రిల్ 22వ తేదీన పహల్గాంలో పర్యాటకులను ఉగ్రవాదులు అత్యంత దారుణంగా బలి తీసుకున్నారని, ఈ దాడిని ఖండించడంలో దేశ ప్రజానీకం ప్రదర్శించిన ఐక్యత, సమైఖ్యత అభినందనీయమన్నారు. అయితే కేంద్ర ఇంటలిజెన్స్ నిఘా వైఫల్యం వల్లే ఈ దారుణం జరిగిందన్నారు. ఉగ్రవాదం పేరుతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశంలో హిందూ, ముస్లింల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతోందని, ఆపరేషన్ సిందూర్ పేరుతో మూడు రోజుల్లో కాల్పుల విరమణ చేయడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు పెంచల నరసయ్య, సుధీర్, షాహినా బేగం, వీర్ల శ్రీనివాసులు, కామయ్య, సుబ్రహ్మణ్యం, రవి, వినయ్, తేజ, ఖలీల్, సంపత్, సుధాకర్, హమీద్, ఇక్బాల్, మహేష్, మల్లి తదితరులు పాల్గొన్నారు.

### శిక్షణా తరగతుల పరిశీలన



**నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట):** నగరంలోని ఎంజీబీ మాల్లో రాష్ట్ర చెస్ అసోసియేషన్, శ్రీఆనంద్ చెస్ వింగ్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ తరగతులను అంతర్జాతీయ ఆర్బిటర్, అనంతపురానికి చెందిన కోచ్ పఠాన్ హుస్సేన్‌ఖాన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంజీబీ మాల్ వ్యవస్థాపకుడు ఎంఆర్ గంగాధర్ మాట్లాడుతూ బాలల్లో విశ్లేషణాత్మక, తార్కిక నైపుణ్యం పెంపొందించేందుకు చెస్ ఉపయోగపడుతుందన్నారు.

### హామీలను అమలు చేయాలి



**నెల్లూరు(వీఆర్సీసెంటర్) :** కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య అన్నారు. నగరంలోని సంతపేటలో ఉన్న పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మాణాలను రూ.5 లక్షల నగదు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో సీపీఐ ఆధ్వర్యంలో జూన్ 2న కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాలో ప్రజలు పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు. అనంతరం పోస్టర్‌ను విడుదల చేశారు. వివిధ పార్టీల నేతలు సిరాజ్, షాన్ వాజ్, నందిపోగు రమణయ్య, సురేష్, కొండలరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### కళాకారులను ప్రోత్సహించాలి



**నెల్లూరు(బృందావనం):** కళలు, కళాకారులను ప్రోత్సహించాలని కేతా అంకులు మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు కేతా సుబ్బారావు తెలిపారు. పురమందిరంలో కేతా అంకులు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుభమస్తు షాపింగ్ మాల్ అధినేత బయ్యా వెంకటరమణయ్య జయంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు. తొలుత వెంకటరమణయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం కళారంగానికి ఆయన అందించిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా పాటలు, డ్యాన్స్ పోటీల విజేతలకు ప్రోత్సాహక నగదు బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు, సంగీత విభావరి అలరించింది. కార్యక్రమంలో నాగిశెట్టి రమణయ్య ఎ.జయప్రకాష్, అబ్దుల్, రఘురామిరెడ్డి, మల్లికార్జున, గోవర్ధన్, ఓరుగంటి సత్యనారాయణ శర్మ, మల్లీశ్వరి పాల్గొన్నారు.

# కష్టపడే వారికి ప్రాధాన్యత



నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న ఆనం విజయకుమార్‌రెడ్డి

- రూరల్ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి

**నెల్లూరు సిటీ:** డ్రామాలు, డబుల్ గేమ్‌లు ఆడే వారు పార్టీకి అవసరం లేదని, పార్టీ కోసం కష్టపడే వారికి ప్రాధాన్యత ఉంటుందని వైఎస్సార్‌సీపీ రూరల్ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి అన్నారు. రూరల్ నియోజకవర్గంలోని చింతారెడ్డిపాళెంలో ఉన్న ఆయన నివాసంలో 30వ డివిజన్ నాయకులు, కార్యకర్తలతో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. 30వ డివిజన్ ఇన్‌చార్జిగా వీరప్పరెడ్డి నారాయణరెడ్డిని నియమిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ కోసం నిజాయతీగా కష్టపడి పనిచేసే చిన్న కార్యకర్త అయినా మంచి పదవి దక్కేలా చూస్తానన్నారు. అధికారం కోసం, డబ్బు కోసం పార్టీని వినియోగించుకునే వారు అవసరం లేదన్నారు. డబుల్ గేమ్ డ్రామాలు ఆడేవారు, అధికార పార్టీ బెదిరింపులకు భయపడే వారు తనకు అవసరం లేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంటే అభిమానం, పార్టీ పట్ల క్రమశిక్షణతో ఉండే వాళ్లకు మాత్రమే ఇక్కడ చోటు ఉంటుందన్నారు. పార్టీ అంటే అభిమానం ఉండే ప్రతి ఒక్కరినీ నేను కుటుంబంతో సమానంగా చూసుకుంటానని హామీ ఇచ్చారు. సమావేశంలో పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీ లేబురు పరమేశ్వర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి రావు శ్రీనివాస్‌రావు, వివిధ విభాగాల అధ్యక్షులు కనకట్ల మోహన్‌రావు ముదిరాజ్, ఆళ్ల మనోహర్‌రెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, వంశీకష్ణ, మాజీ ఎంపీటీసీ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు ఉడుత మురళి యాదవ్, నరసింహారెడ్డి, హరిరెడ్డి, వెంకట్‌రెడ్డి, నారాయణరెడ్డి, రామిరెడ్డి, శ్రీకాంత్, మహిళా నేతలు పి.వసంతమ్మ ఉమా మహేశ్వరి, భారతి, దుర్గ, బుజ్జమ్మ, కపమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు అండగా వైఎస్సార్‌సీపీ



పార్టీ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పర్వతరెడ్డి

**నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట):** ప్రజలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని వైఎస్సార్‌సీపీ సిటీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. నగరంలోని రామ్‌జీనగర్‌లో ఉన్న పార్టీ కార్యాలయంలో తొమ్మిదో డివిజన్ నాయకులు, కార్యకర్తలు ఆదివారం పర్వతరెడ్డితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారు డివిజన్ సమస్యలపై చర్చించారు. పార్టీ బలోపేతానికి కలిసికట్టుగా ముందుండి ఏకతాటిపై పనిచేస్తామని తెలిపారు. అనంతరం చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ డివిజన్‌లో ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తూ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. కష్టకాలంలో పార్టీ కోసం శ్రమిస్తున్న ప్రతిఒక్కరికీ సముచిత ప్రాధాన్యత కలిస్తామని ఎమ్మెల్సీ తెలిపారు.

### దామిశెట్టికి ఎమ్మెల్సీ పరామర్శ



**నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట):** కావలిలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మేధావుల ఫోరమ్ జనరల్ సెక్రటరీ దామిశెట్టి సుధీర్‌నాయుడు తండ్రి శ్రీనివాసనాయుడు ఇటీవల మృతిచెందడంతో వారి కుటుంబసభ్యులను ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా శ్రీనివాసనాయుడుతో తనకున్న అనుబంధాన్ని చంద్రశేఖర్‌రెడ్డి గుర్తు చేసుకున్నారు.

### క్యారమ్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శిగా శ్రీనివాసులు



శ్రీనివాసులు

**నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట):** క్యారమ్స్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యదర్శిగా వాగ్దా స్కూల్ కరెస్పాండెంట్ పక్కల శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీమన్నారాయణ ఆదివారం తెలిపారు. ఈయన గతంలో కూడా జిల్లా క్యారమ్స్ అసోసియషన్ కార్యదర్శిగా, ప్రస్తుతం జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేసిన అనుభవం ఉంది. ఈ క్రమంలో శ్రీనివాసులును క్లబ్ కార్యదర్శి పొన్నపోలు సుధాకర్‌రెడ్డి, మాజీ రంజీ ప్లేయర్ మలిరెడ్డి కోటారెడ్డి, నెల్లూరు క్లబ్ ఈసీ మెంబర్ జట్టి సురేష్‌రెడ్డి, క్యారమ్స్ జిల్లా కమిటీ సభ్యుడు మద్దిన విశ్వనాథ్, జాయింట్ సెక్రటరీలు షేక్.నజీర్‌బాషా, కె.శ్రీనివాసులురెడ్డి, జి.రామ్మోహన్, పలువురు అభినందనలు తెలిపారు.

### క్రీడాకారులకు పౌష్టికాహారం అందజేత

**నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట):** వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీ స్టేడియంలో క్రీడాకారులకు ఆదివారం పౌష్టికాహారాన్ని అందజేశారు. దాత హైటెక్ ఫార్మసీ అధినేత నలుబోలు రమణారెడ్డి చేతుల మీదుగా పంపిణీ కార్యక్రమం జరిగింది. గుండె వ్యాధి నిపుణురాలు కె.భార్గవి, అసోసియేషన్ అధ్యక్షుడు చింతల అమరేందర్‌రెడ్డి, సెక్రటరీ పొన్నం రవిచంద్ర, కోశాధికారి జీకే గోపినాథ్, వాకర్స్ మాజీ గవర్నర్ ఎస్.రాఘవంద్రశెట్టి, చంద్రమౌళి, డీవీ సుబ్బరాజు, సుబ్బరామిరెడ్డి, విజయమోహన్ నాయుడు, రాజా రమేష్, ఖలీల్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

# బ్రాహ్మణ సంఘీయులకు గుర్తింపు కార్డులు



**నెల్లూరు(బృందావనం):** స్టోన్‌హౌస్‌పేట రైతుబజార్ సమీపంలోని ఓ ఫంక్షన్‌హాల్లో జిల్లాలోని పురోహిత బ్రాహ్మణ సంఘీయుల ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పురోహిత బ్రాహ్మణ సంఘీయులకు గుర్తింపు కార్డులు అందజేశారు. పంచాంగాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా పురోహిత బ్రాహ్మణ సమూహం అధ్యక్షుడు ముప్వ ప్రసాద్‌శర్మ మాట్లాడుతూ నియోజకవర్గ, మండల స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. కాగా సమూహం ప్రధాన కార్యదర్శిగా కుప్పచ్చి సతీష్‌శర్మ, ఉపాధ్యక్షుడిగా నాగరాజశర్మ, కోశాధికారిగా పీవీ నరసింహారావులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

### మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ



**నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట):** ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం క్రీడాకారులకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు కిలారి శ్రీనివాసులునాయుడు మనుమరాలు మేధ పుట్టినరోజు సందర్భంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గువ్వల నారాయణరెడ్డి, కోశాధికారి మాగంటి ప్రసాద్, నలుబోలు బలరామయ్యానాయుడు, కనకట్ల రఘురామ్ ముదిరాజ్, బిరదవోలు రామ్మోహన్‌రెడ్డి, కొండూరు సుబ్బారావు, నసీర్ అహ్మద్, బి.సదానందరెడ్డి, రావూరి సుబ్బారావు, ఎన్వీ రమణారెడ్డి పాల్గొన్నారు.

# చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి

**నెల్లూరు(క్రైమ్):** చెట్టుపై నుంచి టెంకాయలను దించుతుండగా ప్రమాదవశాత్తు కిందపడి వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు.. కొండాయపాళెం నక్కలగుంటకు చెందిన కాటయ్య(37), చెంగమ్మ దంపతులకు వరుణ్ సంతానం. భార్యభర్తలు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గత కొంతకాలంగా కాటయ్య నగరానికి చెందిన మీరాబాయి వద్ద టెంకాయ చెట్లు నుంచి కాయలు దించి పీచు తీసే పనులకు వెళ్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం గోపాల్ అనే వ్యక్తి కాటయ్య వద్దకు వచ్చి బీవీనగర్ ఉమ్మారెడ్డిగుంటల్లోని తన చెట్ల నుంచి టెంకాయలు దించేందుకు రావాలని కోరారు. దీంతో ఆయన గోపాల్ వెంట వెళ్లారు. కాటయ్య చెట్టుపై నుంచి టెంకాయలు దించుతుండగా ప్రమాదశవాత్తు కిందపడడంతో తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందాడని నిర్ధారించారు. విషయం తెలుసుకున్న చెంగమ్మ తన కుమారునితో ఆస్పత్రికి చేరుకుని విగతజీవిగా ఉన్న భర్తను చూసి కన్నీటి పర్యంతమైంది. ఈ మేరకు ఆమె వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### 31న ఎన్టీఆర్ పురస్కారాల ప్రదానోత్సవం

**నెల్లూరు(బృందావనం):** ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా సింహపురి ఆర్ట్ క్రియేషన్స్, సితార ఎంటర్‌టైన్‌మెంట్ ఆధ్వర్యంలో ఈనెల 31వ తేదీన 'ఎన్టీఆర్' పురస్కారాల ప్రదానోత్సవం జరుగనుందని నిర్వాహకురాలు లావణ్య ఆదివారం తెలిపారు. నగరంలోని పురమందిరంలో శనివారం సాయంత్రం కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా పాటలు, డ్యాన్స్ పోటీలు జరుగుతాయని, విజేతలకు ప్రోత్సాహక బహుమతులను అందజేయడంతో పాటు వివిధ రంగాల్లో ఉత్తమ సేవలందిస్తున్న వారికి 'ఎన్టీఆర్ సేవా రత్న' పురస్కారాలను అందజేయనున్నామన్నారు. పూర్తి వివరాల కోసం 79953 99341 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

# మాతృమూర్తులకు పాదపూజ



**నెల్లూరు(బృందావనం):** స్టోన్‌హౌస్‌పేట పప్పుల వీధిలోని మహాలక్ష్మమ్మ దేవస్థానం వద్ద తల్లికి పాదపూజ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి నుడా మాజీ చైర్మన్, ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ మాజీ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ హాజరై, మాట్లాడారు. తల్లిని గౌరవించుకోవడం ప్రతిఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి సతీమణి సునందమ్మ, మంత్రి నారాయణ కుమార్తె షరిణి తదితరులు హాజరయ్యారు.

### సరస్వతీ నగర్‌లో ఉచిత వైద్యశిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

**నెల్లూరు(అర్బన్):** నగరంలోని సరస్వతీ నగర్‌లో చెన్నై హాస్పిటల్స్ ఇన్ఫర్మేషన్ సెంటర్ ఆధ్వర్యంలో నూతనంగా ప్రారంభించిన చెన్నై హాస్పిటల్ పాలి క్లినిక్‌లో ఆదివారం ఉచిత వైద్యశిబిరం జరిగింది. కార్యక్రమాన్ని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం షుగర్, బీపీ, ఈసీజీ, ఎకో లాంటి పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆస్పత్రి అధినేత ఎస్వీ రమేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

# కార్పొరేట్ వైద్యం పేదలకు అందాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి ఆనం, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

**నెల్లూరు(అర్బన్):** జిల్లాలో పేదలకు తక్కువ ఖర్చుతోనే కార్పొరేట్ వైద్యసేవలు అందించేందుకు నిర్వాహకులు సహకరించాలని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. నగరంలోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో జరిగిన కిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సిల్వర్ జూబ్లీ వేడుకలను మంత్రి ఆనంతో పాటు పలువురు ఎమ్మెల్యేలు జ్యోతి ప్రజ్వలన చేసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ కిమ్స్ ఆస్పత్రిని బొల్లినేని సోదరులు కృష్ణయ్యానాయుడు, శ్రీనయ్య సహకారంతో వారి తమ్ముడు, సర్జన్ భాస్కర్‌రావు నెల్లూరులో స్థాపించడం అభినందనీయమన్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ప్రశాంతిరెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ, పాశం సునీల్‌కుమార్, కాకర్ల సురేష్, ఇంటూరి నాగేశ్వరరావు, నెలవల విజయశ్రీ, ఎమ్మెల్సీలు బల్లి కల్యాణ్ చక్రవర్తి, కంచర్ల శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్సీ బీద మస్తాన్‌రావు, మాజీ ఎమ్మెల్యే బొల్లినేని కృష్ణయ్యానాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిభావంతులకు నగదు ప్రోత్సాహకాలు



పురస్కారం అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

**నెల్లూరు(బృందావనం):** కొండాయపాళెం రోడ్డు వసంతోపు సెంటర్ వద్ద ఉన్న జనహిత-వాత్సల్య బాలల, వృద్ధుల ఆశ్రమంలో వివిధ కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న నిరాదరణకు గురైన 23 మంది విద్యార్థులకు ఆదివారం రూ.23 వేల ప్రోత్సాహక నగదు బహుమతిని అందజేశారు. ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు హాజరై, మాట్లాడుతూ గత ఐదేళ్లుగా జనహిత–వాత్సల్య ఆశ్రమంలో ఉంటున్న చిన్నారులకు విద్యాభివృద్ధితో పాటు 'మానవసేవయే మాధవ సేవ' బృందం సభ్యుల సహకారంతో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు ఎనలేనివిగా వివరించారు. గత ఐదేళ్లుగా జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయ అధికారి అయ్యప్పనేని బాలకృష్ణారెడ్డి స్వయంగా ప్రోత్సాహక బహుమతులను అందజేయడంతో పాటు ఈ ఏడాది 15 మందికి రూ.వెయ్యి చొప్పున అందజేశారన్నారు. అలాగే పలువురు విద్యార్థులకు విశ్రాంత సీహెచ్‌ఓ ఆర్.ఇందిర, విశ్రాంత పీహెచ్‌ఎస్ పగడాల సుశీలమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ జోగిపద్మ, విశ్రాంత మాస్‌మీడియా ఆఫీసర్ బి.శ్రీనివాసులు, రిటైర్డ్ సూపరింటెండెంట్ కల్వం శ్రీనివాసులు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నరేంద్ర, ఎం.విజయమ్మ, డాక్టర్ సాయిస్పందన, జి.కృపావరం తదితరులు పాల్గొని, విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. తొలుత కేక్ కట్ చేశారు.

అనంతరం అయ్యప్పనేని బాలకృష్ణారెడ్డిని సన్మానించారు. ఆశ్రమ కార్యనిర్వాహక కార్యదర్శి జీవీ సాంబశివరావు ఆధ్వర్యంలో కార్యక్రమంలో నిర్వాహకులు వినీత, అరవ పరిమళ, అరుణ రాణి, విజయమ్మ, వారణాసి శేషగిరిరావు, నున్న హరిప్రసాద్, జయశ్రీ, గణపతిశాస్త్రి, రాజ్యలక్ష్మి, అక్షయ, హరిత తదితరులు పాల్గొన్నారు.

# చట్టాలపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న పోలీసు అధికారులు

**నెల్లూరు సిటీ:** మానవ అక్రమరవాణా, బాల్య వివాహాలు, బాలలను పనిలో పెట్టుకోవడం వంటివి చట్టరీత్యా నేరమని, ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని యాంటీ హ్యూమన్ ట్రాఫిక్ యూనిట్ (ఏహెచ్‌టీయూ) ఏఎస్సై శ్రీహరి అన్నారు. రూరల్ మండలంలోని దొంతాలి గ్రామంలో నాంచారమ్మ కాలనీ వాసులకు ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా బాల్య వివాహాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బాలికల భద్రత, మహిళల రక్షణే లక్ష్యంగా పోలీస్ శాఖ పనిచేస్తుందన్నారు. బాలికల పట్ల అగౌరవంగా ప్రవర్తిస్తే పోక్సో యాక్ట్, జువైనల్ జస్టిస్ యాక్ట్ ద్వారా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బాల బాలికలు, మహిళలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏహెచ్‌టీయూ ఏఎస్సై సతీష్, టీవీఎస్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# గోశాల ప్రారంభం



గోవులకు పూజలు చేస్తున్న వేదపండితులు

**నెల్లూరు సిటీ:** రూరల్ నియోజకవర్గంలోని కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు కాలనీలో సరస్వతి శివరామ మందిర ప్రాంగణంలో శ్రీచంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి గో నిలయాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వేదపండితుడు నాగరాజశర్మ ఆధ్వర్యంలో గోపూజ, గాయత్రిమాత జపపారాయణ చండీహోమం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. దేవస్థాన కమిటీ అధ్యక్షుడు జంగా శివకుమార్ మాట్లాడుతూ దాతల సాయంతో గోశాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సెక్రటరీ ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.